సాక్షి
విశాఖపట్నం
మంగళవారం | 12 | సెప్టెంబర్ | 2023



కలెక్టర్‌తో డీఆర్వో భేటీ

డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన కె.మోహన్‌కుమార్ సోమవారం కలెక్టర్ మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు.



విలువలతో సాహిత్యం

మౌలిక విలువలతో కూడినదే సాహిత్యమని ఎస్వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. 8లో



అబ్బురపరిచిన జైల్ ఉత్పత్తులు

జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు సోమవారం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. 8లో

న్యూస్‌రీల్

ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షలకు 654 మంది హాజరు



అభ్యర్థుల వేలిముద్రలు నమోదు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆరిలోవ: విశాఖ రేంజ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాల కోసం విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు సోమవారం 654 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు గత నెల 25 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం హాజరైన అభ్యర్థులకు ఇక్కడ పోలీస్ సిబ్బంది వేలిముద్ర వేయించి, సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం వారికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.24.63 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. గత నెల 9 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు హుండీల ద్వారా రూ.24 లక్షల 63 వేల 152 నగదు, 63 గ్రాముల 450 మిల్లీ గ్రాముల బంగారం, 850 గ్రాముల 100 మిల్లీ గ్రాముల వెండి వచ్చింది. అలాగే యూఎస్‌ఏకి చెందిన 92 డాలర్లు, సింగపూర్‌కి చెందిన 12 డాలర్లు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 230 పౌండ్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్‌కు చెందిన 10 రియల్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన 10 ధీరమ్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.రాజేంద్ర కుమార్, జగన్నాథస్వామి ఆలయ ఈవో టి.రాజ్‌గోపాల్, శ్రీహరి సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనగర్ కార్పొరేషన్‌ను సందర్శించిన జీవీఎంసీ బృందం



జీవీఎంసీ బృందానికి స్వాగతం పలికిన శ్రీనగర్ మేయర్ జునైద్ అజీమ్ మత్తు

డాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన కార్పొరేటర్ల బృందం సోమవారం శ్రీనగర్ కార్పొరేషన్‌ను సందర్శించింది. శ్రీనగర్ మేయర్ జునైద్ అజీమ్ మత్తు జీవీఎంసీ బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శ్రీనగర్‌లో చేపడతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ బృందానికి వివరించారు. అనంతరం జీవీఎంసీ చేపడతున్న అభివృద్ధి పనులను మేయర్ హరివెంకటకుమారి వారికి వివరించారు. కార్యక్రమంలో శ్రీనగర్ మున్సిపాలిటీ జాయింట్ కమిషనర్, స్మార్ట్‌సిటీ మేనేజర్, అధికారులతో పాటు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్‌లీడర్లు బాణాల శ్రీనివాసరావు, ఏజే స్టాలిన్, డీపీవో చక్రవర్తి, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

14న ఏయూలో జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ కెమిస్ట్ విభాగంలో 250, జూనియర్ కెమిస్ట్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కి 27 ఏళ్లు, జూనియర్ కెమిస్ట్‌కి 30 ఏళ్ల లోపువారు అర్హులు పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కి నెలకు రూ.19,744, జూనియర్ కెమిస్ట్‌కి ఏడాదికి రూ.3.5 లక్షలు వేతనంగా అందిస్తామన్నారు. డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ ఆపరేషన్స్ ఉద్యోగానికి టైప్ రైటింగ్‌లో నిమిషానికి 28 పదాలు టైప్ చేయగలిగి, డిగ్రీ విద్యార్హత గల వారు అర్హులన్నారు. మొత్తం 258 ఖాళీలు ఉన్నాయని, వీరికి నెలకు వేతనంగా రూ.15 వేలు అందిస్తారన్నారు. ఆసక్తి గల వారు వివరాలను ncs.gov.inలో నమోదు చేసుకోవాలన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.

తుస్సుమన్న బంద్



మద్దిలపాలెంలో యథావిధిగా తిరుగుతున్న వాహనాలు



మధురవాడ రైతు బజార్‌లో వినియోగదారుల రద్దీ

- టీడీపీ పిలుపునకు కానరాని స్పందన
- యథావిధిగా కార్యకలాపాలు
- తెరుచుకున్న దుకాణాలు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు విఫలమైంది. యథావిధిగా ప్రజా జీవనం కొనసాగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ టీడీపీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. దీనికి జనసేన, వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఈ బంద్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలెవరూ పట్టించుకోలేదు. యథావిధిగా రోడ్లపైకి వచ్చి.. తమ పనుల్లో మునిగిపోగా.. ప్రజా రవాణా వ్యవస్థ సైతం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగాయి. విశాఖ రీజియన్ పరిధిలో 684 బస్సులు షెడ్యూల్ ప్రకారం తిరిగాయి. దాదాపు అన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. పూర్ణామార్కెట్, నెహ్రూబజార్, రైతుబజార్లు, వస్త్ర, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులు కొనసాగాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరిగాయి.

బంద్‌కు దూరంగా..

అధిష్టానం బంద్‌కు పిలుపునిచ్చినా ఉమ్మడి విశాఖ జిల్లాలోని టీడీపీ నేతలు పెద్దగా పట్టించుకోలేదు. జనసేనకు చెందిన నేతలు, వామపక్ష నాయకులు సైతం బంద్ గురించి స్పందించలేదు. కొందరు కార్యకర్తలు మాత్రమే రోడ్డెక్కి హడావుడి చేశారు. ద్వితీయ శ్రేణి నేతలు బంద్‌కు దూరంగా ఉన్నారు. అసలు చంద్రబాబును అరెస్ట్ చేస్తే.. తమకేంటి సంబంధం అన్నట్లుగా ప్రజలే కాదు.. టీడీపీ, జనసేన శ్రేణులు సైతం వ్యవహరించడం గమనార్హం. కొందరు టీడీపీ కార్యకర్తలు జెండాలతో హడావుడి చేస్తున్నా.. జనాలు అవేమి పట్టించుకోకుండా తమ పనులు తాము చేసుకున్నారు. ఎన్‌ఏడీ జంక్షన్, గాజువాక, అనకాపల్లి, మధురవాడ, జగదాంబ, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, మద్దిలపాలెం, పెదవాల్తేరు, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో దుకాణాలు మూయించేందుకు ప్రయత్నించగా వ్యాపారులు ఒప్పుకోలేదు.

అల్లర్లు సృష్టించేవారిని అదుపులోకి..

చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు విధ్వంసానికి తెగబడే అవకాశాలుంటాయనే సమాచారంతో ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 144 సెక్షన్ విధించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. ర్యాలీలు, సభలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చివరికి చోడవరంలో టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలోనూ ఒక్కరు కూడా కనిపించలేదు. అల్లూరి జిల్లాలో పలు చోట్ల సంతలు యథాతథంగా కొనసాగాయి. ఇలా జిల్లా నలుమూలలా టీడీపీ బంద్‌కు మద్దతు కరువవ్వడంతో ఆ పార్టీ నేతలు అయోమయంలో పడిపోయారు. ఏం చేయాలో తెలియక అసహనానికి గురైన కొందరు నేతలు అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించగా.. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. చోడవరంలో బస్సులు ఆపేందుకు ప్రయత్నించిన టీడీపీ శ్రేణుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. యలమంచిలి పట్టణంలో దుకాణాలు బలవంతంగా మూసివేయించాలని చూసిన టీడీపీ, జనసేన కార్యకర్తల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. లంకెలపాలెం ప్రధాన రహదారిపై నిరసన తెలిపి వాహన రాకపోకలకు అవాంతరాలు కల్పించేందుకు ప్రయత్నించిన టీడీపీ శ్రేణుల్ని పోలీసులు అందుపులోకి తీసుకున్నారు. ఇలా ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. అయితే.. పోలీసులకు పెద్ద పనిలేకుండా టీడీపీ, జనసేన, వామపక్షాలే బంద్‌ని బహిష్కరించినట్లు వ్యవహరించడం కొసమెరుపు.



ఎన్ఏడీ కూడలిలో..



పెందుర్తిలో...



గాజువాకలో యథావిధిగా దుకాణాల నిర్వహణ

పర్యాటకం.. కొత్త పుంతలు



- విశాఖ హబ్‌గా ఉత్తరాంధ్ర పర్యాటక భూములు
- హబ్ పరిధిలో 427 ఎకరాలున్నట్లు గుర్తించిన పర్యాటక శాఖ
- రెవెన్యూ శాఖ పరిధిలో భూముల బదలాయింపు ప్రక్రియ దాదాపు పూర్తి
- డీపీఆర్‌లు ఇవ్వాలని జీఐఎస్‌లో ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు మార్గదర్శకాలు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో పర్యాటకాభివృద్ధి జరిగేలా సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులకు ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన భూములను ఆయా ప్రాజెక్టులకు అప్పగించేందుకు టూరిజం శాఖ కసరత్తు ప్రారంభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న పర్యాటక భూముల పరిధిని విశాఖ హబ్‌గా ఏర్పాటు చేస్తూ.. ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుగుణంగా భూ కేటాయింపులు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే జీఐఎస్‌లో ఎంవోయూలు చేసుకున్న 15కి పైగా సంస్థలు డీపీఆర్‌లు పర్యాటక శాఖకు సమర్పించాయి.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా.. జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి.

భూ బదలాయింపు ప్రక్రియ షురూ

విశాఖ హబ్ పరిధిలో 39 పార్సిళ్లలో 427.08 ఎకరాలున్నట్లుగా గుర్తించారు. ఇందులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో 296.15 ఎకరాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 43.1 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 32.78 ఎకరాలు, విజయనగరం జిల్లాలో 48.8 ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 6.25 ఎకరాలను గుర్తించారు. ఇందులో అత్యధిక భూములు రెవెన్యూ పరిధిలో ఉండడంతో వాటిని బదలాయించాలని పర్యాటక శాఖ అధికారులు జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. దీంతో రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించి బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఈ భూముల బదలాయింపు దాదాపు పూర్తయింది. త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి. ఈ సమయంలో ఎంవోయూలు చేసుకున్న పెట్టుబడిదారుల నుంచి కూడా ఫైల్స్ కదిలేలా చేస్తున్నారు. ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) కూడా అందించాలంటూ ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటికే 15 సంస్థలకు పైగా ఏపీటీడీసీ అధికారులకు తమ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు అందజేశాయి. దీని ద్వారా ఏ ప్రాజెక్టుకు ఏ ల్యాండ్ అవసరమవుతుందనే దానిపై నిర్ణయించి ఆయా సంస్థలకు కేటాయింపులు చేపట్టే ప్రక్రియను ప్రారంభించనున్నారు.



పర్యాటక భూములు

సీఎంఎస్ సిబ్బందే కాజేశారు

రూ.32 లక్షల బ్యాగు అపహరించిన ముగ్గురి అరెస్ట్



గోపాలపట్నం: కంచే చేను మేసిన చందంగా ఏటీఎం కేంద్రం మెషీన్‌లో సొమ్ము జమ చేయాల్సిన సీఎంఎస్ సంస్థ ఉద్యోగులు రూ.32 లక్షలు కాజేసిన ఘటన ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు క్రైమ్ ఎస్‌ఐ డి.కాంతారావు తెలిపిన వివరాల ప్రకారం... ఏటీఎం కేంద్రంలోని మెషీన్లలో పెట్టేందుకు సీఎంఎస్ సిబ్బంది ఈ నెల 2న శుక్రవారం వ్యానులో 5 నగదు బ్యాగులు తీసుకెళ్లాల్సి ఉంది. అయితే మరుసటి రోజు శనివారం తీసుకెళ్లాల్సిన రూ.32 లక్షలున్న బ్యాగును కూడా సీసీ కెమెరాలకు చిక్కకుండా వ్యానులోకి తీసుకుపోయారు. అనంతరం దాన్ని కాజేశారు. ఈ విషయాన్ని బ్యాంక్ మేనేజర్ మరుసటి రోజు శనివారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన వెస్ట్ సబ్ డివిజన్ క్రైం పోలీసులు నగదు బ్యాగు కాజేసిన కంచరపాలెం, దొండపర్తికి చెందిన పెంటకోట కుమార్, కోరాడ వెంకటఅఖిల్ సురేష్, సూరాడ నవీన్‌ను అరెస్ట్ చేశారు. కుమార్, సురేష్ సీఎంఎస్ సంస్థలో ఉద్యోగులు కాగా నవీన్ వీరికి స్నేహితుడు. క్రైమ్ ఏడీసీపీ నాగన్న ఆదేశాల మేరకు వెస్ట్ డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి పర్యవేక్షణలో ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, ఎస్‌ఐ డి.కాంతారావు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.32 లక్షలు రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

బారులుదీరిన అర్జీదారులు

మహారాణిపేట : జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ వినతులను అధికారులకు సమర్పించుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చిన సోమవారం నాటి బంద్ ఏమాత్రం ప్రభావం చూపించలేదు. దీంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సోమవారం విశేష స్పందన లభించింది. స్పందన రిజిస్ట్రేషన్ల వద్ద, వినతులు సమర్పించే కౌంటర్ల వద్ద ప్రజలు క్యూ కట్టారు.

సమస్యలు తక్షణం పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 144 వినతులు అందాయి. రెవెన్యూశాఖలో 57, జీవీఎంసీకి 31, పోలీసు శాఖకు 15, ఇతర శాఖలకు 41 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు, జీవీఎంసీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఇంటి నిర్మాణానికి అనుమతివ్వాలి



జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఇంటి నిర్మాణానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇంటి మంజూరు పత్రం ఇచ్చారు. దీంతో ఇంటి నిర్మాణం మొదలుపెట్టా. రెవెన్యూ అధికారులు వచ్చి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అధికారులే సమస్యను పరిష్కరించాలి.

– కొల్లి సుందరరావు, పెదగంట్యాడ

కాలుష్య సమస్య పరిష్కరించండి



పెదగంట్యాడ మండలం నక్కవానిపాలెంలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన వేస్ట్‌ప్లాగ్ వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా డంపింగ్ చేసే వాహనాలు గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి నుంచి వచ్చే దుమ్ము,ధూళితో కాలుష్య సమస్యలు ఎదురవుతున్నాయి. – బి.నాగిరెడ్డి, నక్కవానిపాలెం

చేపలపై వాతావరణం ఎఫెక్ట్

- అధిక ఉష్ణతాపం, వర్షాభావంతో తగ్గుతున్న లభ్యత
- ఈ ఏడాది వీటి ప్రభావం వేటపై చూపుతుందంటున్న నిపుణులు
- గతేడాదికంటే మత్స్య సంపద తగ్గుతుందని మత్స్యశాఖ అంచనా

సాక్షి, విశాఖపట్నం : చేపల లభ్యతపై వాతావరణం ప్రభావం చూపుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులతో వీటి లభ్యత తగ్గుతోంది. కొన్నేళ్లుగా చేపలవేటకు వెళ్లిన తమకు చేపలు ఆశాజనకంగా లభించడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. దీనివల్ల చేపలవేట తమకు గిట్టుబాటు కాని పరిస్థితులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఇందుకు వాతావరణ మార్పులు, అసాధారణ ఉష్ణోగ్రతలు కూడా ఓ కారణమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో వేసవి తీవ్రత అధికంగా ఉండడమే కాదు.. ఎక్కువ రోజుల పాటు కొనసాగుతోంది. పైగా వర్షాలు కూడా గతి తప్పుతున్నాయి. వేసవి రోజులకంటే వర్షాకాలం, శీతాకాలం సీజన్లలో చేపలు పుష్కలంగా లభిస్తాయి. ఇందుకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడం ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 26–28 డిగ్రీల మధ్య, సముద్రం అడుగున 14–18 మధ్య ఉంటాయి. సముద్రంలో చేపలు చల్లటి ఉష్ణోగ్రతల్లోనే ఎక్కువగా తిరుగుతుంటాయి. సముద్ర జలాలు తరచూ పైకి, కిందకు (అప్‌వెల్లింగ్, డౌన్‌వెల్లింగ్) కదులుతూ ఉంటాయి. చేపలకు పోషకాహారమైన ప్లవకాలు (ప్లాంక్టాన్లు) చల్లని నీటిలోనే పెరుగుతాయి. అలాంటి చోట్ల చేపలు తిరుగుతాయి. సముద్ర జలాలు చల్లగా ఉంటే అవి తరచూ పైకి వస్తుంటాయి. ఆ సమయాల్లో మత్స్యకారుల వలలకు బాగా చిక్కుతుంటాయి. కానీ ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటే నీరు కూడా వేడెక్కి చేపలు పైకి రాకుండా సముద్రం దిగువన లోతుల్లోనే (డీప్ సీ)లోనే ఉండిపోతుంటాయి. ఈ వేడిని అవి తట్టుకోలేక చల్లని ఉష్ణోగ్రతలున్న దూర ప్రాంతాలకు వెళ్లిపోతుంటాయని విశాఖలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.మధుసూధనరావు 'సాక్షి'కి చెప్పారు.



హార్బర్‌లో బోట్ల నుంచి చేపలను దించుతున్న మత్స్యకారులు

మరోవైపు సముద్ర జలాలు వేడిగా ఉంటే చేపల్లోని రక్తం కూడా వేడెక్కుతుంది. ఈ పరిస్థితుల్లో చేపలు సముద్రం ఉపరితలంపైకి రాకుండా అనువుగా ఉండే మరో ప్రాంతానికి తరలి పోతుంటాయని, మత్స్యకారులకు చేపల లభ్యత తగ్గిపోవడానికి ఇదొక కారణమని మత్స్యశాఖ జిల్లా అధికారి జి.విజయ 'సాక్షి'కి తెలిపారు. ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మత్స్య సంపద తగ్గుతూ వస్తోంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే చేపలవేట ఆశాజనకంగా ఉంటోందని, ఎండల తీవ్రత ఉంటే అరకొరగా ఉంటోందని వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంక్షేమ సంఘం కార్యదర్శి సూరాడ సత్తిబాబు 'సాక్షి'తో చెప్పారు.

ఈ నేపథ్యంలో మత్స్యశాఖ ఏటికేడాది తమ మత్స్య ఉత్పత్తుల లక్ష్యాన్ని తగ్గించుకుంటోంది. ఉదాహరణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి చేపలు, రొయ్యల ఉత్పత్తి లక్ష్యం 1,29,785 టన్నులుగా నిర్దేశించింది. అది 2023–24 సంవత్సరానికి 1,28,020 టన్నులకే పరిమితమైంది. కొన్నేళ్ల నుంచి వివిధ కారణాల వల్ల భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరిగిపోతోంది. ఫలితంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు (సీ సర్ఫేస్ టెంపరేచర్స్) కూడా పెరుగుతున్నాయి. సాధారణంగా భూ ఉపరితల ఉష్ణోగ్రతల కంటే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. అయినప్పటికీ కొన్నేళ్లుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం మత్స్యసంపద లభ్యతపై చూపుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
రవీంద్రభారతి స్కూల్,
ద్వారకానగర్ ఫస్ట్ లైన్, విశాఖపట్నం
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబరు : 70757 09205

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మహారాణిపేట: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ట్రెనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫీమేల్) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి, దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 30వ తేదీ గడువుగా నిర్ణయించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు http@//cfw.nic.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

15న వక్తృత్వ పోటీలు

మహారాణిపేట: గాంధీ జయంతిని పురస్కరించుకొని హిందీ, ఇంగ్లిష్ భాషాల్లో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల యువతీ,యువకులు ఈనెల 15న ఉదయం 9 గంటలకు రేసపువానిపాలెం క్యూఎంటీ చర్చ పక్కన ఆదిత్య బిజినెస్ స్కూలులో నిర్వహిస్తున్న వక్తృత్వ పోటీల్లో పాల్గొవాలన్నారు. 18–29 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులన్నారు. Gandh is Global Impact@ Relevance of Gandhian Thought in Todays World అనే అంశంపై మూడు నిమిషాలకు మించ కుండా హిందీ లేదా ఇంగ్లిష్‌ల్లో వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికై న యువతీ,యువకులు అక్టోబర్ 2న పార్లమెంటు హౌస్, న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని, ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ విజేతలతో కొద్ది సేపు భేటీ అవుతారని మహేశ్వరరావు చెప్పారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
Lift Service Technician : 01 No
Sales Executive : 02 No's
Receptionist : 01 No
ARL TECHNOLOGIES
Beside Khazana Jewellers Road, Lakshmi Nivas, # 101, Gopalapatnam, Visakhapatnam
Cell: 7815809907, 7013331975

WANTED TEACHERS
SRISHTI WORLD SCHOOL
(Affiliated to CBSE, New Delhi)
SECTOR-XI, UKKUNAGARAM, VISAKHAPATNAM-32
PHYSICS TEACHER FOR HIGH SCHOOL
Trained Graduates with B.Ed. and minimum 2 years experience.
BIOLOGY TEACHER FOR HIGH SCHOOL
Trained Graduates with B.Ed. and minimum 2 years experience.
ENGLISH TEACHER
Trained Graduates with B.Ed. and minimum 2 years experience.
Walk-in-Interview on 13th & 14th Sept 2023 between 9 AM to 2 PM (or) Interested Candidates may apply by 13th Sept 2023 with recent resume and Passport size Photo to:
E-Mail: srishtiworldschool@gmail.com
Contact Nos: 9391188874, 9121001899, 8985242592

అబ్బురపరిచిన జైలు ఉత్పత్తులు



తమిళనాడు జైల్‌లో ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులు



సదస్సులో ఏర్పాటు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న బీపీఆర్అండ్‌డీ డీజీ శ్రీవాత్సవ్

ఆరిలోవ: జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు సోమవారం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్అండ్‌డీ), ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రుషికొండ ప్రాంతం సాయిప్రియ రిసార్ట్స్‌లో ఈ సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ సదస్సు మంగళవారం ముగియనుంది. సదస్సులో కేంద్ర హోం శాఖసహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ముఖ్యఅతిథిగా, రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు బీపీఆర్ అండ్‌డీ డీజీ బాలాజీ శ్రీవాత్సవ్, ఏపీ జైళ్ల శాఖ డీజీ అనీష్‌కుమార్ గుప్తా, అన్ని రాష్ట్రాలజైళ్ల శాఖ డీజీపీలు, ఐజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ఆవరణలో దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న జైళ్లలో ఖైదీలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శించారు. దుస్తులు, చెక్కతో తయారుచేసిన వివిధ బొమ్మలు, ఫినాయిల్, అల్లిక బుట్టలు తదితర వస్తువులు అతిథులను ఆకట్టుకొన్నాయి. ఆయా వస్తువులు ధరలు వాటి వద్ద రాసి పెట్టారు. వీటిని తిలకించిన ఆయా రాష్ట్రాల జైళ్ల అధికారులు వారివారి జైళ్లలో కూడా ఖైదీలతో తయారు చేయించాలనే ఆలోచనకు వచ్చారు.



ఫొటో ప్రదర్శన..

ప్రాణం తీసిన 'వీడియో గేమ్'

- వీడియో గేమ్‌లో మాదిరిగా సాహసాలకు పాల్పడిన బాలుడు
- మెడకు చున్నీ బిగుసుకుపోయి ఊపిరాడక మృతి



బాలుడి మృతదేహం

మద్రిపాలెం: సెల్‌ఫోన్‌లో వీడియో గేమ్‌లకు అలవాటు పడ్డాడు బాలుడు. అందులో మాదిరిగా సాహసాలు చేయాలనుకున్నాడు. చివరకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కై లాసపురం కస్తూరినగర్–1లో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్న ఎనిమిదేళ్ల బాలుడు డింపుల్ సూర్య వీడియో గేమ్‌లకు అలవాటు పడ్డాడు. వీడియో గేమ్‌ల్లో మాదిరిగా సాహసాలు చేయాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఇంటి వరండాలో ప్లాస్టిక్ పైపునకు ఓ పక్క చున్నీ కట్టి మరోపక్క మెడకు చుట్టుకొని చుట్టూ ఆడుతూ తిరిగాడు. దీంతో చున్నీ పూర్తిగా బాలుడి మెడకు చుట్టుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి పైడా గుణేశ్వరలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు తండ్రి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు.

ముగిసిన జెడ్పీ వైస్ ఛైర్మన్ అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఆత్మీయులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సబ్బవరం: జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు అంత్యక్రియలు స్వగ్రామం మద్రిపాలెంలో సోమవారం ముగిశాయి. గత ఎన్నికల్లో సబ్బవరం జెడ్పీటీసీ సభ్యునిగా విజయం సాధించి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈ క్రమంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆత్మీయులు, బంధువులు అంతిమ యాత్రలో పాల్గొని అప్పారావు పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ,, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చోడవరం నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, బోకం రామునాయుడు, మోపాడ అప్పారావు, రాపేటి రాము తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



గురునాథరావు (ఫైల్)

గోపాలపట్నం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి కరాసా వద్ద ప్రమాదంచోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెంలో నివాసముంటున్న మళ్ల వెంకట గురునాథరావు (59) స్టీల్ ప్లాంట్‌లో ఆర్అండ్‌డీ విభాగంలో ఫోర్‌మన్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజు బస్సులో వెళ్లే గురునాథరావు సోమవారం బంద్ కారణంగా ద్విచక్రవాహనంపై తన స్నేహితుడైన తోటి ఉద్యోగి ఎల్లాజీరావుతో కలిసి బయలుదేరాడు. కంచరపాలెం నుంచి మద్రిపాలెం మీదుగా బీఆర్టీఎస్ రోడ్డులో వెళుతుండగా ఎన్ఏడీ నుంచి కంచరపాలెం వైపు వస్తున్న కారు ముందు వెళుతున్న వీరి వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న గురునాథరావు బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్డుపైకి ఎగిరి పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఎల్లాజీ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. గాయపడిన ఎల్లాజీని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గురునాథరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె జాహ్నవి హోమియోపతి వైద్యురాలు, కుమారుడు ఎంబీబీఎస్ పూర్తి చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసాద్ తెలిపారు.

ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపుపై దృష్టి సారించాలి



వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీఎఫ్ బాధ్యులు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలపై దృష్టి సారించాలని వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్ రెడ్డితో కలిసి సోమవారం విజయవాడలో రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్‌ను కలసి ఉపాధ్యాయుల వేతనాల సమస్యపై చర్చించారు. ఇటీవల జరిగిన బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియతో కేడర్‌స్ట్రంత్ పూర్తికాక ఉపాధ్యాయులకు సకాలంలో అందలేదన్నారు. అదేవిధంగా 1998 డీఎస్సీ, రెండో ఎంటీఎస్‌లకు సైతం వేతనాలు రావటం లేదని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హెర్బ్ పోర్టల్‌లో డీడీవో, ఎంప్లాయిస్ కోడ్ అనుసంధానంతో ఉపాధ్యాయుల వివరాలను వెంటనే పొందుపరిచి, జీతాలు సకాలంలో చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్ కేటాయింపులకు ఎటువంటి సమస్య లేకున్నప్పటికీ, చిన్నపాటి సాంకేతిక ఇబ్బందుల కారణంగానే ఉపాధ్యాయుల వేతనాలు పొందేందుకు ఇబ్బంది ఎదురవుతుందన్నారు.ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

మౌలిక విలువలతో కూడినదే సాహిత్యం

తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందన సభ



ఆచార్య ఇనాక్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూక్యాంపస్: మౌలిక విలువతో కూడినదే సాహిత్యమని ఎస్వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఏయూ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆయనను ఏయూ తెలుగు విభాగంలో ఘనంగా సత్కరించారు. తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథులుగా ఆచార్య జి.యోహాన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను తెలుగు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు శాఖలో అద్భుత పాండిత్యంగల మేధావుల సాంగత్యంలో తాను రచనలో రాటుదేలానన్నారు. కన్నీళ్లమయమైన సమాజపోకడను నిశితంగా పరిశీలించి ఎత్తుపల్లాలను జీర్ణించు వేసి సాహిత్యం ద్వారా సమాజానికి అందించానన్నారు. తాను ఇప్పటి వరకు 104 గ్రంథాలు రచించానని వాటిలో మౌలిక అంశాలు, సార్వకాలీక సార్వజనీనమై నిలిచాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు లోక జ్ఞానం కోసం వివిధ ప్రాంతాల సాంస్కృతిక జీవనాన్ని అధ్యయనం చేస్తే విజ్ఞానం విస్తృతమవుతుందన్నారు. తనకు ఎన్ని అవార్డులు వచ్చినా మాతృసంస్థ ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం మధురానుభూతి కలిగించిందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), ఆచార్య గంగిశెట్టి పద్దయ్య, ఆచార్య ఉయ్యూరి భాస్కరరావు, డాక్టర్ ఎస్. పుల్లారావు, ఎస్.అంబేద్కర్ రాజు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, పట్నాన ధర్మారావు, మొండి స్వామి, రామారావు పాల్గొన్నారు.

ఐటీఐలో నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలో ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నాల్గో విడత ఆన్‌లైన్ దరఖాస్తులను iti.ap.gov.in వెబ్‌సైట్‌లో స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుంది. నమోదు అనంతరం విద్యార్థులు తమ దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేయించుకోవాలి. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డునకు సంబంధించిన అభ్యర్థులు తమ కేటగిరీని ప్రత్యేకంగా కాలమ్‌లో పొందుపరిచి విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలి. ఈ నెల 19 సాయంత్రం 5గంటల్లోగా ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. 20న సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాన్నారు. 22, 23 తేదీల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఐటీఐ కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)–ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది)–గాజువాక, ప్రభుత్వ ఐటీఐ–నరవలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని కౌన్సెలింగ్‌కు అర్హత పొందాలని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ కోరారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–తిరుపతి (08583) స్పెషల్ సుమారు 1.20 గంటల ఆలస్యంగా బయల్దేరింది. అటు నుంచి రావలసిన పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు విశాఖపట్నంలో సుమారు రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది.

దుకాణాలు తొలగించకండి

జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'కు 70 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి ఎంవీపీ కాలనీ, ఉషోదయ జంక్షన్లో గత 30 ఏళ్లుగా చిరువ్యాపారాలు చేసుకుంటున్న మా దుకాణాలు..తోపుడు బండ్లను తొలగించొద్దని పలువురు తోపుడు బళ్ల కార్మికులు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. వీటిని తొలగించడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 70 ఫిర్యాదులు వచ్చాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వినతులు స్వీకరించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, డీడీ (హార్టికల్చర్) దామోదరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఇండియన్ బ్యాంకు అధికారులు

మద్రిపాలెం: ఇండియన్ బ్యాంక్ తమ 50వ బ్రాంచ్‌ను మద్రిపాలెంలో ప్రారంభించింది. ఈ మేరకు సోమవారం విజయనగరం మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేషరామన్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న సేవలపై అనుభవాలను వ్యక్తపరిచారు. అనంతరం గణేషరామన్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.11లక్షల కోట్లు దాటిందన్నారు. అన్ని పేరామీటర్లలో ఎఫ్‌జీఎంవో హైదరాబాద్ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. జోనల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ జోన్‌లో మొత్తం వ్యాపారం రూ.9,600 కోట్లు దాటిందని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మద్రిపాలెం శాఖ బ్రాంచ్ మేనేజర్ ఏ.కృష్ణ చైతన్య, బ్యాంకు శాఖల మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక

అనకాపల్లి టౌన్ : గవరపాలెం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి జంప్ రోప్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 9,10,11 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తమ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. 12 సంవత్సరాల సబ్ జూనియర్ విభాగంలో జి.హేమంత్, కె.సందీప్, పి.సాయిచరణ్, 14 సంవత్సరాల జూనియర్ విభాగంలో వై.సూర్యనారాయణ ఎంపికయ్యారని తెలిపారు.

రేపు ములగాడలో 'జగనన్నకు చెబుదాం'

మహారాణిపేట: సమస్యల పరిష్కారానికి నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటల నుంచి ములగాడ మండలం, మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో జిల్లా అధికారులతో నిర్వహించే ఏర్పాటు చేశారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.136
బ్రాయిలర్ (లైవ్)	: రూ.156
స్కిన్	: రూ.282
స్కిన్‌లెస్	: రూ.292

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	510.00
విజయనగరం	514.00
శ్రీకాకుళం	514.00

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discontinued) Exams in September/October ✆ : 73383 76874 [R-98]

Real Estate
FLAT FOR SALE
■ 3BHK, 1475 Sft రీసేల్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. ఎండాడ విశాఖపట్నం కావలసిన వారు సంప్రదించండి. 8885252404. [C-777040]

స్థలం అమ్మకం
■ విజయనగరం, పద్మావతినగర్, శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ లే అవుట్‌లో వుడా అప్రూవ్ ప్లాట్ నెం. 203, 390 చ॥గ॥లు (40x80, West Facing) స్థలం అమ్మకమునకు కలదు. ఫోన్: 94401 23223 [V- 2136]

PLOT FOR SALE
■ DTCP Approval Plots for Sale Sq yard 5,999/- Only 150 Sqy to 450 Sq yards. Near Madturu petrol bunk towards Kondakarla road. Bangkok trip free. Ph : 98666 66595 [V-2135]

SITE FOR SALE
■ రాజులతలవలసలో N.H-16 హైవేకి అర k.m దూరంలో 32 సెంట్లు స్థలం సైట్ అమ్మబడును. ఫోన్: 78936 43252 [V- 797312]

CHANGE OF NAME
I, undersigned SAYYED KHADAR DIWANJI, S/O SAYYED BABAJI, Residing at D.No.38-30-214, Hussain Nagar, Marripalem, VSP-18, A.P., Have Changed my Name Sayed Khader Divanjee (Old Name) to SAYYED KHADAR DIWANJI (NEW NAME) Hence forth I am being called as SAYYED KHADAR DIWANJI

పాస్‌పోర్ట్ పోయినది
నాగులపల్లి రమణి W/o నాగులపల్లి అప్పలరాజు అను నేను డో.నెం. 58-11-144/2, పాత కరస, రామాలయం వీధి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ -530009 నివాసిని. మేము 6 నెలల క్రితం పాత కరస నుంచి మాధవధారకి ఇల్లు మారుతుండగా నా యొక్క పాస్‌పోర్ట్ (నెం. VS3060122937917) పోయినది. ప్రస్తుతం నేను మాధవధారలో కుటుంబంతో నివాసం ఉంటున్నాను. కావున నాయొక్క విన్నపాన్ని స్వీకరించమని కోరుచున్నాను. Cell: 70930 97798.

Services
GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10987]

Wanted
■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే వుండి వృద్ధులను, బెడ్ పేషెంట్స్‌ను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి +భోజనం VJA ✆ 91608 35559,78158 35561 [B-330]
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. Cont: 91777 36926 [G-751681]

CHANGE OF NAME
I, SHABIR HAROON S/o Haroon Mohammed (Late), Resident of D.No.30-15-177, Near Saraswathi Park, Dabagardens, Maharanipeta, Visakhapatnam-530002, A.P. have changed my Name from SHABIR (Old Name) to SHABIR HAROON S/o Haroon Mohammed (Late) (New Name). Henceforth, I being called as SHABIR HAROON (New Name) for All Purposes.

■ వైజాగ్, పీఠాపుర్, గాజువాకలో మా ప్రముఖ షాపింగ్‌మాల్ యొక్క గోడౌన్స్ (Ware house) నందు స్టిక్కరింగ్, ప్యాకింగ్ చేయుటకు 18–35 సం॥లు గల యువతులు మాత్రమే కావలెను. జీ : 9,000/- ఫోన్ : 97046 37370, 97051 94330 [V-26451]
■ Wanted Collection Executives For Reputed Banks Loans Collection for Vizag, Vijayanagaram, Rajahmundry, Kakinada, Eluru, Bheemavaram, Amalapuram, Guntur Locations. Ph : 93814 11091 [V- 583]
■ సెక్యూరిటీ గార్డులు, HR ఆఫీస్ అసిస్టెంట్, రైల్వే క్లీనింగ్, హౌస్‌కీపింగ్, పెట్రోల్‌బంక్ బాయ్స్ కావలెను. జీ : 10 నుండి 20 వేలు, రూమ్ + భోజనం. RSR. సెల్ : 77029 59468, 87904 11889 [V-1047]
■ హైదరాబాదులో అపార్ట్ ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. Age 21-45 వేలు జీతం 15 వేలు ఆపైన, భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలవు. ఆసక్తి కలవారు సంప్ర: 81066 28388 [G-1112]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, హైదరాబాద్ ఫోన్:9640258899, విజయవాడ:9640648899 [HA-590]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం : 90101 96663
గాజువాక : 97059 33394
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

కెనరా బ్యాంక్ Canara Bank
(భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)
#30-15-141, 2వ అంతస్తు, పవన్ కమర్షియల్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-20. ☎ 0891-2724155

స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి ఋణగ్రహీత/తనఖాదారులు: M/s కేదార్‌నాథ్ కమ్మోటైడ్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: డి.నెం. 30-15-138/20, 2వ అంతస్తు, వినాయక్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు M/s కేదార్‌నాథ్ కమ్మోటైడ్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి, రిజిష్టర్డు ఆఫీసు: 23ఎ, నేతాజీ సుభాష్ రోడ్డు, 7వ అంతస్తు, రూమ్ నెం. 31, కలకత్తా-700001, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. హామీదారు/తనఖాదారులు: (1) శ్రీ. సునీల్ కుమార్ చౌదరి (డైరెక్టర్), తండ్రి: కిషన్‌లాల్ చౌదరి, ఫ్లాట్ నెం. 301, రోషన్ టవర్స్, సిరిపురం, విశాఖపట్నం-530003, (2) శ్రీమతి బీనా చౌదరి (డైరెక్టర్), భర్త: సునీల్ కుమార్ చౌదరి, ఫ్లాట్ నెం. 301, రోషన్ టవర్స్, సిరిపురం, విశాఖపట్నం-530003. (3) M/s నారాయణి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: డి.నెం. 30-15-138/20, 2వ అంతస్తు, వినాయక్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020 మరియు M/s నారాయణి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్, రిజిష్టర్డు ఆఫీసు: 23ఎ, నేతాజీ సుభాష్ రోడ్డు, 7వ అంతస్తు, రూమ్ నెం. 31, కలకత్తా-700001, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. (4) M/s నారాయణి ఇస్పాట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: డి.నెం. 30-15-138/20, 2వ అంతస్తు, వినాయక్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020 మరియు M/s నారాయణి ఇస్పాట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి, రిజిష్టర్డు ఆఫీసు: 23ఎ, నేతాజీ సుభాష్ రోడ్డు, 7వ అంతస్తు, రూమ్ నెం. 31, కలకత్తా-700001, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. (5) M/s హరి ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: డి.నెం. 30-15-138/20, 2వ అంతస్తు, వినాయక్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020 మరియు M/s హరి ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ సునీల్ కుమార్ చౌదరి రిజిష్టర్డు ఆఫీసు: 20, బల్లిగంజ్, సర్క్యులర్ రోడ్డు, కలకత్తా-700019, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం వారు తేది 31.08.2023 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.44,45,10,783.53/- (అక్షరాల నలభై నాలుగు కోట్ల నలభై ఐదు లక్షల పది వేల ఏడు వందల ఎనభై మూడు రూపాయలు మరియు యాభై మూడు పైసలు) + తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలు (ఏవైనా ఉన్నచో) కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే సూచనప్రాయంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 29.09.2023 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజలకు మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు తెలియజేయడమైనది.
ఇ-వేలం తేది & సమయం: 29.09.2023, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపులతో)
రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీయవలెను లేదా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, దాబాగార్డెన్స్ బ్రాంచ్ వారి ఖాతా నెం.209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0000620 కు తేది: 27.09.2023, సా॥ 4.00 గం.ల లోపుగా చెల్లించవలెను.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తుల వివరములు:
ఆస్తి నెం-1: సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3134/2012 తేది. 14.08.2012 ప్రకారం M/s హరి ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున గల ఆస్తి: ఆంధ్రప్రదేశ్-530012, విశాఖపట్నం, గాజువాక ఎస్ఆర్ఒ, విశాఖపట్నం జీవీఎంసీ లిమిట్స్, గాజువాక మండలం, అగ్గిరాజుపేట గ్రామం, సర్వే నెంలు. 5/1, 5/4, 6/3 మరియు 9 నందు మొత్తం 14520 చ॥గ॥ విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు. హద్దులు: తూర్పు: 20 అ॥ ప్రైవేట్ రోడ్డు, దక్షిణం: ఇతరుల భూమి, పడమర: రైవాడ కాలువ, ఉత్తరం: M/s లిక్షు ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ భూమి.
గమనిక: డాక్యుమెంట్ నెం.3608/2016 తేది 21/06/2016 గల ఆస్తి నెం.1 బ్యాంక్ వారికి రిజిష్టర్ తనఖా చేసిన తరువాత బ్యాంక్ వారికి తెలియకుండా మరియు బ్యాంక్ వారిని సంప్రదించకుండా రిజిష్టర్ లీజు డీడ్ డాక్యుమెంట్ నెం.3730/2019 తేది 16/07/2019 ద్వారా చేయడమైనది. TP చట్టం నందలి ప్రొవిజన్స్‌కు ఇది వ్యతిరేకం మరియు ఇది చెల్లనేరదు మరియు బ్యాంక్‌కు కట్టుబడి ఉండదు.
రిజర్వు ధర: రూ. 9,44,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 94,40,000/-
ఆస్తి నెం-2: సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 389/2016 తేది. 29-03-2016 ప్రకారం M/s కేదార్‌నాథ్ కమ్మోటైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరునగల ఆస్తి: విజయనగరం జిల్లా-535217, నెల్లిమర్ల ఎస్ఆర్ఒ పరిధి, ఐడిఎ, సర్వే నెం. 327 పార్ట్, ప్లాట్ నెం. 60 నందు మొత్తం 2153.11 చ॥గ॥ లేదా 1800 చ॥మీ॥ స్థలం మరియు అందులోని 728 చ॥అ॥ ఆర్‌సిసి స్లాబ్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 63, దక్షిణం: ప్లాట్ నెం. 61, పడమర: 18.00 మీ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 59.
రిజర్వు ధర: రూ. 70,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 7,00,000/-
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, విశాఖపట్నం ఎఆర్ఎమ్‌బి, చీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 0891-2724155, 8332956773. ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.
తేది: 09.09.2023, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్